# రాయి మడుసులు

కిష్ట ఒడ్డునవుండ ఆ నల్లరాయి కొండ బొహు గెట్టిది. దాన్ని సూపించి, దాని రాయితో తనకు బవనం బొహు గెట్టిగ కట్టాలన్నాడు సావుకారు, రాయి మడుసుల్తో.

సావుకారుకు లచ్చలచ్చ లుండియి. ఆయన్ని వూర్లో బొహు గొప్పోడంటారు జనం. అంత గొప్పోడికి ఎంతమాలావు గెట్టిగన్నా వుండాల బవనం.

వందలకొద్దీ కూలిరాయిమడుసులు సావుకారు బవనానికి నల్లకొండను తొలుత్తా వుండారు.

ఒక్కపాలి కొండమయాన రెక్కలు బిగదీసి నిలబడీ తొలుత్తా వుంటం బొహు పెమాదం. అలుపుమీన కాలు జారిందంటే... అయితే రాయి మడ్సుల గుండె బొహుగెట్టి. జనం నల్లరాయి గెట్టంటారు గాని అంతా వుత్తది.

రాయిమడ్సుల జంపరి దెబ్బకు నల్లరాయి గుంటపడుద్ది. ఆ గుంటలో బోలుడు మందు కూరి – సానా పెమాదం – టపీ ల్మనిపించేతలికి ఒక పాలి పది పదేను బళ్ళ బండరాళ్లు ఎగిరి కిందపడాల్చిందే.

సావుకారు బవనానికి సయిజు సరిజూసి ఆట్ని ముక్కలముక్కలగ నరుకుతారు. రాయిమడ్సులు. అయి ఎన్న కరిగినట్టు కరుగుతయి ఆరి సేతుల్లో, అట్టాటి వందలు, ఏలుః లచ్చల సయిజు ముక్కల్ని బవనం కట్టేకాడికి తోల్తారు రాయి మడ్సులు – దుమ్ము! బొహు దుమ్ము! ముక్కునా నోట్న బోయి కడుపులో అచ్చులు పేరుకుంటాయి.

రాళ్ళ గుట్టలు సుట్టూతా తిరుగుతా ననుకుంటాడు సావుకారు.

పునాదిమీద గొబ్బిరికాయ కొట్టి, దణ్ణం పెద్తా పక్కకి తప్పుకుండాడు సావుకారు.

రాయిమీన రాయి, గోడమీన గోడ, అంతస్తుమీన అంతస్తు – ఎటొయినా రాయి బహు దొంగది. అప్పుడప్పుడు ఈలుజూసుకుని తూల్తా వుంటది. అట్టాటి తూలుడు రాయి మడ్సులకు బొహు పెమాదం. ఎంత రాయిమడసి గెట్టిమడిసయినా ఆ తూలుడుకు ఒల్లు రంధ్రంబడి రఖతం కారుద్ది. బరువుతోకూడ్న పని గనక ఒల్లు కాకెక్కి రఖతం మరింత వుసిమీన పిసికారు కొటినట్టయి, నల్లరాళ్ళు ఎర్రబడి వూటకారుత్తయి కూడా – అంతరిచ్చానికి రాయిమడ్సుల రఖతంగక్కుతా లెగిసింది సావుకారు బవనం.

జనం ముక్కు మీన ఏలేసుకుండారు సావుకారు గొప్పజూసి. 'ఎంతగెట్టి! అబ్బ ఎన్ని రంగులు! అబ్బ, అమ్మనాయినో!" అన్నారు జనం.

ఒక పెడగా వుండి సేతులు సూసుకుండాడు రాయి మడిసి.

బవనం గొప్ప సూపియను గొప్పోరికి బవనంలో యిందుజేశాడు సావుకారు. యిందుకుడిసి బవనం జూత్తా గొప్పోరు సావుకార్ని 'గొప్పో' దన్నారు.

సేతులు కడుక్కొని 'ఎల్లొత్తా' నన్నాడు రాయిమడిసి సావుకార్ని దూరంగా సూత్తా, 'వొచ్చి కూలీ తీసుకుపోవేందిరా? వూఁబేగి!" అన్నాడు సావుకారు గుమాత్తా మద్దెనొచ్చి.

ఆకర్రోజు కూలి అర్ధరూపాయ, కండువా కొంగున సుట్టి, పొద్దువాల్ని కూసేపుటికి గూడెంలో గుడిశకి సేరుకుండాడు రాయిమడిసి.

"అయినట్టేనా?" అంది రాయిమడిసి పెల్లాం రాయిమడిసికి బువ వొడ్డించి...

"అయిందేంది." అన్నాడు రాయిమడిసి యిసుగ్గా.

"ఏం దవుద్దేం?" యియ్యాల్తో అయిద్దంటివిగా?"

"అవకేం జేసుద్దిలే!"

"ఉహుఁ! ఎవుడన్నాడు కాదనీ!"

"ఎహె వుండు నసా!"

"యీడ ఎవురికేం పట్టలా నసబెట్టను!"

"అయితే ఏందే నువనేదీ?"

"నాకేం బట్టింది అంటానికీఁ అయిపాయె గందా, సావుకారేమన్నాడన్నా?"

"సావుకారూ!"

"యిగసాల్లే! అదేందో యిందు జేత్తా వుండాడంటగా?"

" యిందా – ఏం జేత్తే?"

"నాకు దేనికిలే మొదులు! ఏందో పడ్డాక ఇంత కాసి బోత్తావుంటే ఎల్లి పోతుండె దినాలు. యిందులో వుసారుగుంటాడు గందా. ఏమన్నా అడిగిసూత్తానంటి వనన్నా. ఇగనేం వుంటదీ!"

"యిగ ఆడకి ఆపుఁ సాలు, తిక్కరేగుతుండది. ఎవుడు నిన్ను నోరు దెరుసుకు కూకోమన్నాడు?"

"ఏమన్నా యియకుంటాడుగా అని నువేగా ముంగలందీ? మాటకు ముంగల నన్ను దేనికీ అంటం?"

"సల్లబోయి?"

"లేవు సల్ల. మంగమ్మ యికమీన దొరకవంది. పెతోరు డబ్బిత్తుంటే, మనకి వూరకనే పోత్తారెట్టా? సల్లసుక్కకు గెతి లేదు."

లెగిసి తభీమని పడ్డది రాయిమడిసి సెయి.

"సచ్చాన్రా నాయినో" అంటా అటనే ఎనిక్కిపడింది రాయిమడిసి పెళ్ళాం."

తబుక్కున వుమ్మూసి ఎల్లి సాపమీన కండవాగప్పుకుని పండుకున్నాడు రాయిమడిసి.

"యదవ సచ్చినోడా!" అంది రాయిమడిసి పెళ్ళాం, కూసేపుండి.

రాయిమడిసి మాట్టాళ్ళేదు.

రేత్తిరి సానా పొద్దుపోయింది.

"తిక్కరేగుండ మడిసితో మాట్టాడొద్దని లచ్చసార్లు జెప్పా!" అన్నాడు రాయిమడిసి.

నిసిరేత్తిరయింది.

"మా వూరెల్లిపోక యీ డెవురుంటారు!" అంది రాయిమడిసి పెల్లాం.

రాయిమడిసి మాట్టాళ్ళేదు. కూసేపయినాక "కాత్తెజరగ" మంది రాయిమడిసి పెల్లాం... యింకూసేపుటికి ఎప్పటికమల్లే తెల్లారుద్ది రాయిమడుసులకి.